ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పరపతి-సహకార సంఘాలు

వ్యవసాయరంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదలలో ప్రధానమైంది వ్యవసాయ విత్తం. వ్యవసాయ ఉత్పాదకాలు కొనుగోలు చేయడానికి, వ్యవసాయ భూమిలో శాశ్వత అభివృద్ధిని చేపట్టడానికి వ్యవసాయదారునికి స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాలిక రుణాలు అవసరం. ఇందు కోసం రైతులు సంస్థాపరమైన, సంస్థాపరం కాని మార్గాలపై ఆధారపడతారు. అనుభవపూర్వకంగా లభించిన వివరాల ప్రకారం మొత్తం వ్యవసాయ పరపతిలో ఇప్పటికీ సంస్థాపరంకాని ఆధారాల వాటానే ఎక్కువ. దీంతో గ్రామీణ రుణగ్రస్తత పెరిగింది. సహకార పరపతి ద్వారా వ్యవసాయ విత్తం విస్తరించిన సమయంలో ప్రభుత్వమే వ్యవసాయ పరపతి సౌకర్యాన్ని కల్పించింది.

పేపర్- III
విభాగం-3 యూనిట్-4 సిలబస్

- ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పరపతికి సంబంధించిన సంస్థాగతమైన, సంస్థాగతం కాని వనరుల-నిర్మాణం, వృద్ధి-సహకార సంఘాలు, మొత్తం పరపతిలో వాటి వాటా-తగినంత పరపతి, సమస్యలు.

వ్యవసాయదారుల రుణావసరాలు తీర్చడంలో సహకార రంగం ప్రధాన పాత్ర పోషించగలదని భావించినప్పటికీ ఇటీవలి కాలంలో దీని ప్రాధాన్యత తగ్గింది. సంస్థాపరమైన ఆధారాలలో భాగంగా వాణిజ్య బ్యాంకుల పాత్ర పెరిగింది. అయితే దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు చేకూరిన ప్రయోజనం తక్కువే. 2008-09వ ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య బ్యాంకులు మొత్తం రూ.19,338 కోట్ల పరపతినందించాయి. ఇందులో పంట రుణాల రూపంలో రూ.16,469 కోట్లు, వ్యవసాయటర్మ్ రుణాలు రూ.2,969 కోట్లు. ఇదే ఆర్థిక సంవత్సరంలో నాబార్డ్ రైతు మిత్ర గ్రూపులకు మొత్తం రూ.175.45 కోట్ల పరపతి అందించింది. రాష్ట్రంలో మొత్తం 2.38 లక్షల రైతుమిత్ర గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రూపులో చిన్న, సన్న కారు, కౌలు రైతులు మొత్తం 15 మంది సభ్యులుంటారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ పథకంలో భాగంగా రాష్ట్రం లో 63.41లక్షల వ్యవసాయ రుణ ఖాతాలు రద్దయ్యాయి. మొత్తం 1105 మండలాలకుగాను 1056 మండలాల్లో రుణా విముక్తి మేళాలను నిర్వహించారు. మొత్తం



రూ.11,353.71 కోట్ల రుణాలను మాఫీ చేశారు. రాష్ట్రంలో ఆశించిన రీతిలో సంస్థాపరమైన పరపతి వాటా పెరగకపోవడం.. సహకార రంగం ఆశించిన రీతిలో రైతుల ప్రయోజనాలు తీర్చలేకపోతున్న నేపథ్యంలో.. పరపతిలో వివిధ ఆధారాల పాత్రను చర్చించే క్రమంలో సిలబస్ రూపొందించారు.

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్:

- **వ్యవసాయదారునికి పరపతి ఎందుకు అవసరమో వివరిస్తూ రాష్ట్రం లో సంస్థాపరమైన పరపతి ప్రగతిని పరిశీలించండి?**

జ: వ్యవసాయదారుడు తన ఆర్థిక అవసరాలను సొంత వనరుల నుంచి సమకూర్చుకోలేక పోతున్నాడు. దీంతో సన్నకారు,ఉపాంత రైతులు ఎక్కువగా పరపతిపై ఆధారపడుతున్నారు. వ్యవసాయ కార్యకలాపాలు ప్రారంభమైన సమయంలో విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం రైతుకు స్వల్పకాల రుణాలు అవసరం. వ్యవ సాయ పనిముట్ల కొనుగోలు, నీటిపారుదల వసతి నిమిత్తం మధ్య కాలిక రుణాలు, శాశ్వతంగా భూమి అభివృద్ధిని చేపట్టే క్రమంలో దీర్ఘకాలిక రుణాలు అవసరం. వ్యవసాయ పరపతి సమకూర్చే ఆధారాలను సంస్థాపరమైన ఆధారాలు, సంస్థాపరం కాని ఆధారాలుగా వర్గీకరించవచ్చు.

రాష్ట్రంలో సహకార సంఘాలు, వాణిజ్యబ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వ్యవసాయదారునికి సంస్థాపరమైన పరపతి నందిస్తున్నాయి.గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయపరపతిని సమ కూర్చడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ప్రధాన పాత్ర పోషించేవి. కానీ ఇటీవల కాలంలో మొత్తం సంస్థా పరమైన పరపతిలో సహకార రంగం వాటా తగ్గింది. వాణిజ్య బ్యాంకుల నుంచి పెద్ద రైతులే ప్రయోజనం పొందుతూ దాన్ని వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

☞ ఈ క్రమంలో రైతుకు స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాల పరపతి అవసరాన్ని వివరిస్తూ రాష్ట్రంలో సంస్థాపరమైన పరపతిలో వివిధ ఆధారాల వాటాలో మార్పులు ఎలా సంభవించాయో గణాంకాల సహాయంతో వివరించాలి.

- **వ్యవసాయ పరపతిలో సంస్థాపరం కాని ఆధారాల పాత్రను వివరించండి?**

జ: వ్యవసాయదారులు తమ ఆర్థిక అవసరాల దృష్ట్యా వడ్డీవ్యాపారులు, ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లు, భూ స్వాములు, స్నేహితులు, బంధువులను పరపతి కోసం ఆశ్రయిస్తున్నారు. ఈ విధంగా పొందిన పరపతిని సంస్థాపరం కాని ఆధారాలుగా పేర్కొనవచ్చు. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయేతర అవసరాల కోసం కూడా వీరు పరపతి అందిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పరపతినందించడంలో వీరు ప్రాచుర్యం పొందారు. సంస్థాపరం కాని పరపతి మూలాల్లో వడ్డీ వ్యాపారుల పాత్ర అధికం. వడ్డీ రేటు ఎక్కువయిన ప్రామిసరీ నోటు ఆధారంగా స్వల్పకాలిక రుణాలు సమకూరుస్తున్నారు. స్థిరాస్తుల తాకట్టుతో దీర్ఘకాలిక పరపతిని ఎటువంటి కాలయాపన లేకుండా అందిస్తున్నారు. దీంతో రైతుల రుణభారం పెరిగి తమ భూములను వడ్డీ వ్యాపారులకు స్వాధీన పరచాల్సి వచ్చేది. గ్రామీణ ప్రాంతాల్లోని కమీషన్ ఏజెంట్లు రైతులకు పంట చేతికి వచ్చిన వెంటనే వారిపై ఒత్తిడి తెచ్చి ఇచ్చిన రుణాన్ని వసూలు చేసుకుంటారు. గిట్టుబాటు ధరలు లభించే వరకు వేచిచూసే అవకాశం లభించడం లేదు. దీంతో కొంత ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. చిన్న, సన్నకారు రైతులు, కౌలుదారులు వ్యవసాయ పరపతి నిమిత్తం భూస్వాములపై ఆధారపడుతున్నారు. మొత్తం సంస్థాపరం కాని పరపతిలో వీరి వాటా 10 శాతం.

అనుభవపూర్వకంగా లభించిన ఆధారాల ప్రకారం చిన్న, సన్నకారు రైతులు తమ అవసరాల నిమిత్తం ఇప్పటికీ 60 నుంచి 80 శాతం మంది వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, రాష్ట్రంలో మెట్ట ప్రాంత పంటల ఉత్పత్తిలో ఒడిదుడుకులు, వివిధ ప్రాంతాలలోని చిన్న, సన్నకారు రైతుల ఆదాయాలలో ఏమాత్రం పెరుగుదల లేకపోవడానికి కారణాలు. మరో వైపు సంస్థాపరమైన ఆధారాల విషయంలో వాణిజ్య బ్యాంకుల కఠిన నిబంధనలు రైతులను సంస్థాపరం కాని ఆధారాలను ఆశ్రయించేలా చేశాయి.

☞ ఈ క్రమంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ ఆదాయాల పెరుగుదల విషయంలో ఏర్పడుతున్న అవరోధాలను వివరిస్తూ తద్వారా సంస్థాపరంకా ని ఆధారాల పాత్ర పెరగడానికి అవి ఏ విధంగా దోహదపడ్డాయో విశ్లేషిస్తూ సమాధానం రాయాలి.

- **సంస్థాపరమైన పరపతిలో సహకార సంఘాల వాటా తగ్గడానికి కారణాలను తెలియజేస్తూ ఆ రంగం ఎదుర్కొంటున్న లోపాలను వివరించండి?**

జ: గ్రామీణ పరపతినందించడంలో రాష్ట్రంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని భావించినప్పటికీ మొత్తం సంస్థాపరమైన పరపతిలో వీటి వాటా తగ్గుతుంది. రాష్ట్రంలో మూడంచెల సహకార వ్యవస్థ పనిచేస్తోంది. గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పర పతి సంఘం, జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సమాఖ్యగా జిల్లా స్థాయిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, రాష్ట్రంలోని సహకార పరపతి వ్యవస్థకు శిఖరాగ్ర సంస్థగా రాష్ట్ర సహకార బ్యాంకు పనిచేస్తోంది. సహకార వ్యవస్థ రైతులకు ఎక్కువగా స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తుం ది. రైతులకు దీర్ఘకాలిక రుణాలనందించడానికి సహకార వ్యవస్థలో భూమి అభివృద్ధి బ్యాంకులను స్థాపించారు. రైతులకు ప్రత్యక్షంగా పరపతిని కల్పించే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నిర్వహణ సమర్థంగా లేకపోవడంతో అవసరమైన నిధులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. రైతులకు రుణాల మాఫిని ప్రభుత్వం ప్రకటించినపుడు ఆ మొత్తాన్ని సహకార సంఘాలకు వెంటనే రీఫైనాన్స్ చేయడంలేదు. దీంతో వీటిని సమ ర్థంగా నిర్వహించలేకపోతున్నారు. ఈ చర్య పరపతిలో సహకార సంఘాల వాటా తగ్గడానికి ప్రధాన కారణం.

సహకార సంఘ నియమావళి పట్ల సభ్యులకు సరైన అవగాహన లేకపోవడం సహకార వ్యవస్థ ప్రగతికి పెద్ద సమస్యగా పరిణమించింది. సహకార సూత్రాల ఆచరణ సరిగా లేకపోవడంతోపాటు రాజకీయ జోక్యం ఎక్కువగా ఉండటం, సంఘాల యాజమాన్యం పెద్ద రైతుల చేతుల్లో ఉండటంతో ప్రజాస్వామ్యయుతంగా పని చేయాల్సిన సంస్థలు ఆచరణలో విఫలమ వుతున్నాయి.

☞ ఈ క్రమంలో సరైన గణాంకాల సహాయంతో మొత్తం పరపతిలో సహకార సంఘాల వాటా ఏ విధంగా ఉంది, సంఘాల వాటా తగ్గడానికి ఏ కారణాలు దోహదపడ్డాయో విశ్లేషించాలి. దీంతోపాటు సహకార సూత్రాలను వివరిస్తూ అవి ఆచరణలో ఏ విధంగా విఫలమయ్యాయో చర్చించాలి.

- **రాష్ట్రంలో గ్రామీణ రుణగ్రస్తత పెరుగుదలకు కారణాలు తెలిపి పెరుగుతున్న రుణభారం ఏ విధమైన పరిణామాలకు దారితీస్తుందో వివరించండి?**

జ: గ్రామీణ రుణంలో వ్యవసాయ రుణాలు ఒక ప్రధాన భాగం. రైతుల ఆదాయాలు తగ్గడంతో వ్యవసాయ పెట్టుబడుల కోసం రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. రైతులకు అనుత్పాదక వ్యయం అధికమవ డం కూడా రుణగ్రస్తత పెరగడానికి ప్రధాన కారణం. సంప్రదాయాలు, సాంఘిక, మత సంబంధ ఆచారాల వల్ల సాంఘిక వ్యయం పెరిగింది. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను ఉపయోగించకపోవడంతో ఆదాయాలు తగ్గుతున్నాయి. కౌలుదారుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు కావడంతో వారికి కౌలు సంస్కరణల గురించి పెద్దగా అవగాహన ఉండడం లేదు. దీంతో కౌలు పరిమాణం ఎక్కువగా ఉండి వారి ఆదాయాలు తగ్గుతున్నాయి. సంస్థాపరమైన పరపతికి అనేక నిబంధ

నలు అడ్డుగా నిలుస్తుం డడంతో సన్నకారు రైతుల్లో అధిక శాతం మంది వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారి వడ్డీ భారం పెరిగి రుణగ్రస్తులవుతున్నారు.

పెరుగుతున్న రుణగ్రస్తత ఆర్థిక, సాంఘిక, రాజకీయ దుష్పరిణా మాలకు దారితీస్తుంది. రుణభారం పెరగడంతో వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గుతాయి. దీంతో అల్ప ఉత్పాదకత నమోదవుతుంది. తద్వారా రైతుల ఆదాయం తగ్గుతుంది. ఈ చర్య పారిశ్రామిక, సేవారంగ కార్యకలాపాలపై వీరు చేసే వ్యయం పై ప్రభావం చూపడంతోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అవరోధంగా పరిణమిస్తుంది. పేదరికం పెరిగి మానవాభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. గ్రామీణ రుణ భారం కారణంగా రైతుల రుణాల మాఫీ కోసం రాజకీయ ఉద్యమాలు మొదలవుతాయి.

☞ ఈ క్రమంలో రుణగ్రస్తతకు కారణాలను విశ్లేషించాలి. పెరుగు తున్న రుణభారం వల్ల ఆర్థిక, సాంఘిక, రాజకీయ దుష్పరిణా మాలు ఏర్పడతాయని భావిస్తూ తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంద నే దృష్టితో సమాధానం రాయాలి.